www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 22 మార్చి 2023

5

వైఎస్ఆర్



మున్సిపల్ కార్మికులకు రుణ సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఉన్న కడప కార్పొరేషన్, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, మైదుకూరు, బద్వేల్ మున్సిపాలిటీలలో పని చేస్తున్న కార్మికులకు రుణ సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ కోరారు. మంగళవారం ఎస్‌బిఐ ఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వేల మంది కార్మికులు ఉన్నారని తెలిపారు. వీరికి రూ.15 వేల నుంచి రూ.21 వేలు వేతనం వస్తుందని పేర్కొన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం ఉందని చెప్పారు. మున్సిపల్ కార్మికులకు, ఆప్కాస్ వారికి రూ.2లక్షలు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. వేతనంలో పట్టుకునినే విధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, కోశాధికారి గోపి పాల్గొన్నారు.

డేటా ఎంట్రీలేరీ!

- ఆరేళ్లుగా నర్సింగ్ కళాశాలకు ముగ్గురు డుమ్మా
- విధులు ఒకచోట, జీతాలు మరొక చోట
- జిజిహెచ్‌లో డేటాఎంట్రీదే హవా



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిజిహెచ్‌లో డేటా ఎంట్రీల ఇష్టారాజ్యం నడుస్తోంది. జిజిహెచ్ నర్సింగ్ కళాశాలకు చెందిన ఓ సూపరింటెండెంట్, ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆరేళ్లుగా విధులొకచోట నిర్వహిస్తూ జీతాలు మరొకచోట తీసుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా నర్సింగ్ కళాశాల పాలనా వ్యవహారాలపై ప్రభావం పడుతోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ఏళ్ల తరబడి సదరు సూపరింటెండెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్లు ఆయా స్థానాల్లో స్థిరపడిపోవడంతో పాలనా వ్యవహారాల్లో తలదూర్చడంపై చర్చ నడుస్తోంది. జిజిహెచ్ నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ యూనియన్ పేరుతో ఉదయాన్నే వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్తున్నట్లు తెలిసింది. ఫలితంగా నర్సింగ్ కళాశాల పాలనావ్యవహారాలపై పర్యవేక్షణ కోల్పోవడంతో శాఖాపరమైన ఇబ్బందులు తలెత్తు తున్నాయనే విమర్శ వినిపిస్తోంది. నర్సింగ్ సూప రింటెండెంట్‌తోపాటు మిగిలిన ముగ్గురు ఔట్ సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్లలో ఒకరు జిజిహెచ్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోని ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్, మరొకరు మరణధ్రువీకరణ సెక్షన్, ఇంకొకరు మెడికల్ కళాశాలకు చెందిన ఓ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. 2016,17 సంవత్సరాల్లో అప్పటి నర్సింగ్ సూపరింటెండెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల మధ్య విబేధాలు తలెత్తినట్లు సమాచారం. అప్పటి కలెక్టర్ డేటా ఎంట్రీ ఆపరే టర్లను ఇద్దరు జిజిహెచ్, ఒకరిని మెడికల్ కళాశా లల్లో విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఏడాది కిందట రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్లు వర్క్‌ఆర్డర్లు, ట్రాన్స్‌ఫర్లను రద్దు చేసిన సంగత తెలిసిందే. కానీ ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్ర విభాగానికి వెళ్లకపోవడం గమనార్హం. అప్పటి నుంచి నర్సింగ్ ప్రిన్సిపల్ బదిలీపై వెళ్లిపోయి నప్పటికీ, డేటాఎంట్రీ ఆపరేటర్లు మాతృవిభాగానికి వెళ్లకపోవడం విశేషం. జిజిహెచ్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోని ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ డేటాఎంట్రీ ఆపరేటర్ మోనార్క్‌గా వ్యవహరిస్తున్నారనే విమర్శ వినిపిస్తోంది. డేటా ఎంట్రీ ఆపరేటర్ విధుల వరకు పరిమితం గాకుండా అడ్మినిస్ట్రేషన్ సహా ఇతర వ్యవహారాల్లో తలదూర్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

డ్యూటీ తప్పనిసరి

నర్సింగ్ కళాశాల సూప రింటెండెంట్‌కు డ్యూటీని తప్పకుండా చేయాలని కోరా. ఉదయాన్నే ఆఫీసుకు వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్తున్నారు. ఏదైనా ఫైళ్లపై సంతకం చేయాల్సి వస్తే ఆయన చేసిన తర్వాతే చేస్తున్నా. మిగిలిన ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు జనవరిలో వచ్చి కనిపించి వెళ్లిపోయారు.

- డాక్టర్ పి.హిమగిరికుమారి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, కడప.

వివక్షతను రూపుమాపేందుకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ఎస్సీ, ఎస్టీలపై వివక్షతను రూపుమాపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధ్యక్షతన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, ఎస్పీ అన్బు రాజన్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్, సోషల్ వెల్ఫేర్ జెడి జయ ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా జరిగే మొదటి స్పందన కార్యక్రమంలో మొదటి గంటలో ఎస్సీ ,ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ బాలికల వసతి గృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో క్రమం తప్పకుండా బీట్ చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు జరిగినప్పుడు వెంటనే ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలన్నారు. నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అత్యాచారాలను నిరోధించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. గత సమావేశంలో చర్చించిన విషయాలలో చాలా అంశాలను పరిష్కరించామని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ హాస్టళ్లల్లో పోలీసులు రోజూ సాయంత్రం పెట్రోలింగ్ ఉంటుందన్నారు. పోక్సో చట్టం పైన అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జెసి మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లల్లో సమస్యలు ఏమైనా ఉంటే కలెక్టర్, తన, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వారంతపు వారీ సోషల్ ఆడిట్ జస్టిస్‌లకు చెందిన సభ్యులు అధికారుల అనుమతి లేకుండా వెళ్లరాదన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు లేని 138 గ్రామాలను గుర్తించి అందులో 104 గ్రామాల్లో 70 ఎకరాల భూమిని కేటాయించామన్నారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు ధర్మ చంద్రా రెడ్డి, వెంకట రమణ, వెంకటేష్, డిఎస్‌పి శివారెడ్డి బీసీ వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డిఎంహెచ్ఒ నాగరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకట సుబ్బయ్య, జడ్‌పిసిఇఒ సుధాకర్ రెడ్డి, ఎల్‌డిఎం దుర్గ ప్రసాద్, మెప్మా, డిఆర్‌డిఎ పీడీలు రామ్మోహన్‌రెడ్డి, ఆనంద్ నాయక్ పాల్గొన్నారు.

పేదల కడుపు కొట్టొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్



కార్పొరేషన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

నగరంలో రోడ్ల విస్తరణ పేరుతో పేదల కడుపుకొట్టే ప్రయత్నాలు మానుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయం ఎదుట కెసి కెనాల్ కట్ట పక్కన ఉన్న ఇళ్లను కూల్చి వేయాలనే ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహన్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ నగరంలో కెసి కెనాల్ కట్ట పక్కన ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్న ప్రజలను తక్షణమే ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదని వారన్నారు. 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న ప్రజలను అకస్మాత్తుగా ఇప్పటికిప్పుడు రోడ్డు విస్తరణ పేరుతో ఖాళీ చేయాలని చెప్పటం సరైంది కాదని పేర్కొన్నారు. రోజూ పనికి వెళితేనే కడుపు నిండే పరిస్థితి వారిదన్నారు. ఇలాంటి పేదల పట్ల అధికారం పార్టీ యంత్రాంగం తీవ్ర ఒత్తిడి తీసుకురావడం శోచనీయమన్నారు. కట్ట పక్కన 40 అడుగుల రోడ్డు పేరుతో ఆక్రమణలకు దిగితే ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం మీద ఉందన్నారు. కెనాల్ కట్ట పక్కన ఉన్న పట్టా భూములకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే రోడ్డుకు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఇళ్లు కోల్పోయిన వారందరికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతనే వారిని తొలగించేలా చూడాలని చెప్పారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఇళ్లు కోల్పోయిన ప్రజలందరికీ న్యాయం చేస్తామని కమిషనర్ ఇచ్చిన హామీతో ఆందోళనను విరమించారు. నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు పారుక్ హుస్సేన్, శంషాబాద్, షాకీర్ పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

కడప అర్బన్ : జిఓ నంబర్ ఒకటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు ఆందోళన చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ శతాబ్దంలో భారతదేశంలో, సామ్రాజ్యవాద నియంతలు, ప్రజలను అనచడానికి, ప్రజాస్వామ్య హక్కులను హరించడానికి తయారు చేసిన 'బ్రిటిష్ పోలీస్ యాక్ట్' ను ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం జీవో నంబర్ 1ని అసెంబ్లీలో పాస్ చేసి, అమలు చేస్తోందన్నారు. జీవోను వ్యతిరేకిస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి మధు విజయవాడ కేంద్రంలో నిరసన తెలియజేస్తే వారిపై అనుచితంగా ప్రవర్తించి, అక్రమ అరెస్టులు చేయడం దారుణమని వాపోయారు. డిమాండ్ల సాధన కోసం విజయవాడ తరలి వచ్చిన అంగన్వాడీల మీద విచక్షణారహితంగా లాఠీఛార్జీలు, అరెస్టులు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. వెంటనే అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, ఎ.రామమోహన్, జిల్లా కమిటీ సభ్యులు పాపిరెడ్డి, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదగాలి

చెన్నూరు : విద్యార్థులు మంచి ఉన్నత విద్యను అభ్యసించి, భావి భారత పౌరులుగా ఎదగాలని జడ్‌పిటిసి ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు సేవ్ ద చిల్డ్రన్ ఆర్గనైజేషన్ సన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ల్యాబ్ ఏర్పాటు చేసి రూ. 5 లక్షలు విలువచేసే పిఎస్ అండ్ బిఎస్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌ను వారు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లోమడ లక్ష్మీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యకు ఎనలేని ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. నేటి సమాజంలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు ఆస్తిపాస్తులు ఇవ్వకపోయినా, మంచి ఉన్నత చదువును ఇస్తే చాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విమలమ్మ, ఉపాధ్యాయులు రమణారెడ్డి, గంగాధర్, వైసిపి ఎస్‌టి సెల్ మండల కన్వీనర్ సురతాని శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

పోరుమామిళ్ల టౌన్ : గిద్దలూరు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన రమణమ్మ అనే మహిళ పోరుమామిళ్లలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరింది. ఆస్పత్రి వారు ఆమెకు బి పాజిటివ్ రక్తం అవసరమని బంధువులకు సూచించడంతో వారు రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్టున్ ఆశ్రయించారు. వ్యవస్థాపకులు నాయబ్‌రసూల్ స్పందించి పోరుమామిళ్లకు చెందిన పీరయ్యతో రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ రసూల్, ప్రసాద్ దాతను అభినందించారు. కార్యక్రమంలో రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వాలి



ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యాలయంలో సంఘు సేవకుల సలావుద్దీన్

కడప అర్బన్ : చదువుకుంటున్న విద్యా ర్థులకు ప్రతిఒక్కరూ తమకు తోచిన రీతిలో ముందుకు వచ్చి చేయూతను ఇవ్వాలని ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం దారుల్ హసనాత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నగరంలో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు దారుల్ హసనాత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ గుర్తించి వారికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థుల ప్రతిభను గుర్తించి దారుల్ హసనాత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ బహుమతులు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ తప్పకుండా ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయ ఉద్యమ శిల్పి ఎవిఎస్ : యుటిఎఫ్

కడప అర్బన్ : ఉపాధ్యాయ ఉద్యమ శిల్పి అప్పారి వెంకటస్వామి (ఎవిఎస్) అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. మంగళవారం యుటిఎఫ్ భవన్‌లో ఎవిఎస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి భవిష్యత్తులో విద్యారంగ శ్రేయస్సు కొరకు బలీయమైన ఉద్యమాలు చేయాల్సి ఉంటుందనే ముందు చూపుతో యుటిఎఫ్ రాష్ట్రంలోనే ఒక బలీయమైన సంఘంగా తీర్చిదిద్దడంలో అహరహం కృషి చేశారని పేర్కొన్నారు. తన 14 సంవత్సరాల సర్వీసును వదులుకొని విజయవాడలో మకాం వేసి రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్‌ను బలమైన సంఘంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. నేటి ఉపాధ్యాయులు ఎవిఎస్ పోరాట స్ఫూర్తిని ఉద్యమ పంతాను కొనసాగిస్తూ విద్యారంగా శ్రేయస్సుకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

నీటి సంరక్షణ మన బాధ్యత : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

ప్రాణాధారమైన నీరు లేకుండా జీవజాతి మనుగడ సాగించడం కష్టమని, వాటి సంరక్షణ మనందరి బాధ్యత కావాలని యోగివేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య జింక రంగా జనార్దన్ ఉద్బోధించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మంగళవారం యోగి వేమన విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం వద్ద జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ 5వ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆచార్య వి. సునీత ఆధ్వర్యంలో నీటి సంరక్షణ పై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వి సి మాట్లాడుతూ ప్రతి నీటి చుక్క విలువైందని రేపటి తరాలకు అందించేందుకు నేటి నుంచే సంరక్షించే చర్యలను సిద్ధమవుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి విద్యార్థులు, స్కాలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..** నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం రాబోవు రోజుల్లో ఎంతైనా ఉందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాలలోని ఎన్ఎస్ఎస్, జంతు శాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో 'జల సంరక్షణ యొక్క ఆవశ్యకత' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. రవి శేఖర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి, ఎన్ఎస్ఎస్ పిఒ శివ రామ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కెఎస్ఆర్ఎం కళాశాలలో..** నీటి వనరులను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని జల వనరుల శాఖ డిఇఇ రామాజులు పిలుపునిచ్చారు. మంగళవారం కెఎస్ఆర్ఎం కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సిసి రాజశేఖర్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల సివిల్ ఇంజినీర్ డాక్టర్ ఎస్. ఆర్. లక్ష్మీ ప్రసాద్, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, సివిల్ ఇంజినీరింగ్ ఇన్‌ఛార్జి విభాగాధిపతి డాక్టర్ టి. కిరణ్ కుమార్, ప్రోగ్రాం సమన్వయకర్తలు ఆచార్య టి. కిరణ్ కుమార్, కె. నివేదిత, అధ్యాపక సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐలో ఖాతాదారుల సొమ్ము మాయం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

పట్టణంలోని స్టేట్ బ్యాంకులో ఖాతాదారుల సొమ్ము మాయమైంది. ఖాతాదారులు తమ ఖాతాల నుంచి సుమారు రూ. 50 వేల వరకు నగదు పోయినట్లు బాధితులు వాపోయారు. మండలంలోని సిద్దాయపల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటసుబ్బయ్య ఖాతా నుంచి రూ. 31 వేలు, అబ్రహం ఖాతా నుంచి 10 వేలు మాయమైనట్లు బాధితులు పేర్కొన్నారు. తమకు తెలియకుండానే ఖాతాలో నుంచి డబ్బులు పోయాయరని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. బ్యాంకులోనే తమ డబ్బుకు భద్రత లేకపోతే ఎలా అని వాపోయారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని తమ సొమ్మును రికవరి చేయాలని కోరారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - వల్లూరు

క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉర్దూ పాఠశాలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఇక్బాల్ ,టీబీ మమత సూపర్వైజర్ సునీల్ ఏఎన్ఎం నీలావతి , శ్రీదేవి ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి హోటళ్ల సమస్యలు

ప్రజాశక్తి - కడప

కలెక్టర్ విజయ్ రామరాజును కడప హోటల్స్ ఫుడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రషీద్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హోటళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా రషీద్ ఖాన్ మాట్లాడుతూ హోటళ్లకు రాత్రి 10:30 గంటల వరకు ఉన్న పోలీస్ పర్మిషన్ సమయాన్ని పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాత్రి 12 గంటల వరకు పొడిగించాలని కోరారు. సాధారణంగా ఉన్న సమయాన్ని 11 గంటల వరకు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేవారు. అందుకు పోలీసులు అనుమతి, సహకారం అందించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కడప హోటల్స్ అండ్ ఫుడ్ అసోసియేషన్ ఉప కోశాధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్ విజయ్ రామరాజును కలిసి మొక్కను అందజేస్తున్న రషీద్‌ఖాన్

విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాలి

కడప : ఎలాంటి ఊహించని విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాలని డిఆర్ఓ గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో ఎన్‌డిఆర్ఎఫ్ కమాండెంట్ శివకుమార్, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ జి. వి.ఎస్. రాంప్రకాశ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాలో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు,. మాక్ ఎక్స్ పర్ మెంట్ ద్వారా ప్రజలకు, ఆయా ఉత్పాదక సంస్థలు, ఫ్యాక్టరీల్లో సిబ్బందికి అవగాహన కల్పించేందు చేపట్టాల్సిన చర్యలపై ఈ సందర్భంగా డిఆర్ఒ వారికి పలు సూచనలు చేశారు. జాతీయ విఫత్తుల నిర్వహణ టీమ్ అన్ని జిల్లాల్లో మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా మన జిల్లాలో కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ ఉత్పాదక ప్రాంతాల్లో హానికర ప్రభావిత అవకాశాలను గుర్తించేందుకు పలు చోట్ల సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

'అన్నమాచార్య'లో ముందస్తు ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె



సంబరాల్లో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహి ంచారు. ఈ సందర్భగా విద్యా సంస్థల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాటా డుతూ భారతీ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశ సంస్కృతిని ఇతర దేశాల వారు కూడా పాటించడం శుభపరి ణామమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలు అందించాల్సిన అవసరముందని చెప్పారు. యువత మంచి మార్గంలో నడిచి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్తులు సంప్రదాయ దుస్తులతో హాజరై సంబరాలు చేసుకున్నారు.

'గానుగపెంట'కు ఉగాది పురస్కారం

కడప అర్బన్ : ప్రముఖ సాహితీవేత్త భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్, డాక్టర్ గానుగపెంట హనుమంతరావుకు విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మంగళవారం శుభకృతు నామ ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. నవ్యాంధ్ర రచయితల సంఘం, మల్లెతీగ సాహిత్య సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ కవితా దినోత్సవం, ఉగాది ఉత్సవాలలో ఘనంగా సత్కరించారు. ఈ సత్కారం కింద నగదు పారితోషకం, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రం బహుహరించారు.

దూరవిద్యలో ఎంబిఎ ప్రవేశపెట్టాలి

కడప అర్బన్ : యోగి వేమన యూనివర్సిటీలో దూరవిద్యా పద్ధతిలో ఈ ఏడాది నుంచి వివిధ కోర్సులు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో, ఎంబిఎ కోర్సును కూడా ప్రవేశపెట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ్ రెడ్డి, అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, డివో యూనిట్ ఉపాధ్యక్షులు జయచంద్ర కోరారు. మంగళవారం ప్రతినిధి బృందం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ పిఎస్ షావలి ఖాన్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్ బాబు కు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఎల్ఐసి, బ్యాంకులు, ఆర్థిక రంగ సంస్థలు, ఎపిజిబి, డిసిసిబి, ప్రైవేట్ బ్యాంకులు - ఇలా ఎన్నో ఆర్థిక సంస్థలు పనిచేస్తున్నాయని వారు అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వేలాదిమంది ఉద్యోగులు తమ నైపుణ్యం పెంచుకోవాలన్నా, ప్రమోషన్ల ప్రయోజనం పొందాలన్నా ఎంబీఏ పూర్తి చేయాలని, అందుకు దూరవిద్య మాత్రమే శరణ్యమని చెప్పారు. ఈ నేపథ్యంలో యోగివేమన విద్యాలయం ఎంబిఎ కోర్సును ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అడవుల పరిరక్షణలో బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్

కడప : అటవీ పరిరక్షణలో ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యత వహించాలని ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో బాటని విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ 2వేల కంటే ఎక్కువ దేశీయ సంస్కృతులతో సహా దాదాపు 1.6 బిలియన్ల మంది ప్రజలు తమ జీవనోపాధి కోసం అడవులపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బోటనీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం బి సురేష్ బాబు, శివరామకృష్ణ, డాక్టర్ కల్పన, డాక్టర్ సావిత్రి, డాక్టర్ నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరు అక్బర్

దళిత ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయుల స్వామిని కొట్టిన వైసీపీ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని, సుధాకర్ బాబు, వెళ్ళంపల్లి శ్రీనివాస్‌ను స్పీకర్ చట్టపరమైన చర్యలు తీసుకుని హౌస్‌కు శాశ్వతంగా రానివ్వకుండా చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ కోరారు. మంగళవారం పాత బస్టాండ్‌లోని అక్బర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత ఎమ్మెల్యే పై దాడి చేయడం దారుణమన్నారు. రాష్ట్రం ఎక్కడ అన్యాయం జరిగినా చక్కదిద్దే దిశగా చర్చ జరిపే అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలను తిట్టడం, కొట్టడం చరిత్రలో ఇదే మొదటి సారి అన్నారు. ప్రజా స్వామ్యాన్ని, ఎమ్మెల్యేల హక్కులను కాపాడలేని ఫెల్యూర్ స్పీకర్ తమ్మినేని సీతారామ్ జీవితంలో ఎమ్మెల్యే కాలేడని స్పష్టం చేశారు. సమావేశంలో మైనారిటీ రాష్ట్ర సెల్ కార్యదర్శి గగ్గుటూరు నజీర్, దళిత నాయకులు సిటీ ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు నాదిండ్ల దస్తగిరి, రాజంపేట అబ్దుల్ సలాం, రూపన గుడి హుస్సేన్, ఖాదర్ సాబ్ పాల్గొన్నారు.

బిసిల ధర్నాను జయప్రదం చేయాలి

బద్వేలు : ఏప్రిల్ 3న ఢిల్లీలో నిర్వహించబోయే బిసిల ధర్నాను విజయంతం చేయాలని రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి పిలుపునిచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 50 శాతం ఉన్న బిసిలు కుల వృత్తుల ద్వారా సమాజసేవ చేస్తున్నా, నేటికీ బి అన్నిరంగాలలో వెనుకబడివున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లా నుంచి బిసిలందరూ పెద్ద సంఖ్యలో హాజరైన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ వెంకటరమణయాదవ్, నియోజకవర్గ కార్యదర్శి, ఉపాధ్యక్షులు రమణ,జయరాములు, పట్టణ అధ్యక్షులు బాలనరసింహులు, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ మహబూబ్ సాహెబ్ ,యాదవ సంఘం నాయకులు రాజశేఖర్,చంద్ర శేఖర్,రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పోరుమామిళ్ళ: మూడు రోజుల కిందట పట్టణ పరిసరాల్లో ప్రమాదానికి గురైన గుర్తుతెలియని వ్యక్తిని 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతిచెందాడు. ఆసుపత్రి సిబ్బంది వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన తమ సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేశారు. మృతుడు మాల కొండారెడ్డి పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు.


హరున్ కార్స్ షోరూం ప్రారంభం

కడప అర్బన్ : నగరంలోని కర్నూల్-తిరుపతి బైపాస్ రోడ్డులో హరున్ కార్స్ (టాటా కార్స్) షోరూమును డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, జడ్‌పి చైర్మన్ అమరనాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మైదుకూరు ఎంఎల్‌ఎ రఘురామిరెడ్డి, కమలాపురం ఎంఎల్‌ఎ రవీంద్రనాథ్‌రెడ్డి, బద్వేల్ ఎంఎల్‌ఎ డాక్టర్ సుధా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్స్ షోరూం కడపలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దేశంలో టాటా కార్స్‌కు ఎంతో ఆదరణ ఉందని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హరున్ బజాజ్ ఎండి అహమ్మద్‌బాష, ఎంఎల్‌సి జకియా ఖానం, డిప్యూటీ సిఎం నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ పాక సురేష్, షఫీ, మాజీ కార్పొరేటర్ జమాల్‌వల్లి, టాటా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

డిఇఒకు 'ఆపస్' అభినందనలు

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్రామి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.చెన్నయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షులు రామమోహన్ రెడ్డి, కార్యదర్శి సుబ్బరాయుడు,జిల్లా మీడియా ఇన్ చార్జి బాలకృష్ణుడు, శ్రీనివాసులు, నారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి,యల్లయ్య మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవ రెడ్డిని కలిసి శాలువా, బొకేతో అభినందించారు. ఈ సందర్భంగా ఉగాది మరుసటి రోజు స్థానిక సెలవును మంజూరు చేయమని కోరారు.10 వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఒ సూచించారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న పిఒ ప్రభాకర్‌రెడ్డి

కడప అర్బన్ : విద్యార్థులు కష్టంతో కాక ఇష్టంతో చదవాలని ఎస్ఎస్ఎ పిఒ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని చిన్నచౌకు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి అక్కడ చదివే విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ నిజ జీవితంలో ఉన్నత స్థానం చేరుకోవాలంటే క్రమశిక్షణతో చదవాలన్నారు. చదువు తోపాటు ఆటలు, పాటలు, మాటల్లో నైపుణ్యం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి మిట్ట కేశవ రెడ్డి స్థానిక పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెద్దముడియం

అకాల వర్షాలకు నూర్పిళ్లకు సిద్ధంగా ఉన్న పంటలు నేలపాలు కావడం బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దపెద్ద వక్షాలు, కరెంటు స్తంభాలతోపాటు తెల్ల కుసుమ, మిరప, మొక్క జొన్న, మినుము పంటలు నేలకొరిగి రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చాయి. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే, అధికారులు మండలంలోని శుద్ధపల్లె గ్రామ పంటలను పరిశీలించారు. గ్రామ రైతులు ఎమ్మెల్యే వద్ద బాధను వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేలా ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పంటల పరిశీలనలో తహశీల్దార్ జ్యోతిరత్నకుమారి, ఎఒ ఓబులేస్, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపిడిఒ వెంకటరమణయ్య, ఆర్ఐ భువనేశ్వరి, జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట రమణారెడ్డి, గ్రామ సర్పంచు బాలమ్మ, సింగం సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు కష్టాలు చెబుతున్న రైతులు

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు, పెద్దముడియం, రాజపాలెం మండలం అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జమ్మలమడుగు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.రాజేశ్వరిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల వివరాలు జమ్మలమడుగు పట్టణంలోని కన్నెల్లూరు-2అంగన్వాడీ కార్యకర్త(ఒసి), రాజుపాలెం మండలం వెలవలి-2 అంగన్వాడీ కార్యకర్త (బిసిసి), అంగన్వాడీ సహాయకురాలు పెద్దముడియం మండలం పెద్దపసుపుల-6(ఒసి), రాజుపాలెం మండలం గాదెగూడూరు-1(ఎస్‌సి), రాజుపాలెం మండలం వెలవలి-1(ఇడబ్ల్యుఎస్), జమ్మలమడుగు పట్టణంలోని కన్నెల్లూరు-3(ఒసి) సహాయకురాల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె వివరించారు. ఈనెల 21 నుండి 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జమ్మలమడుగు ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని ఆమె వివరించారు.

ముద్దనూరు : ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, మైలవరం మండలాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, మినీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం సిడిపిఒ ముంతాజ్‌బేగం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండాపురం మండలంలోని బొమ్మేపల్లి గ్రామంలో కార్యకర్త (బిసి.సి), ఏటూరులో సహాయకురాలు (ఎస్‌సి), మైలవరం మండలంలోని మైలవరం-2లో సహాయకురాలు (ఎస్‌టి), ఎం.కంబాలదిన్నె సహాయకురాలు (బిసి.డి), ముద్దనూరు మండలంలోని చిన్న దుద్యాలలో సహాయకురాలు (ఇడబ్ల్యుఎస్) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హతగల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 27లోపు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని సిడిపిఒ కోరారు.

అలరించిన ముందస్తు ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - చాపాడు

బుధవారం తెలుగు సంవత్సరాది (ఉగాది) సందర్భంగా స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ముందస్తు సంబరాలు అలరించాయి. ముఖ్యఅతిథిగా సిబిఐటి కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ పండుగ అంటే అందరూ కలిసి జరుపు కోవాలని, ఆనందోత్సాహాలతో ఉండాలని తెలిపారు. ఇరుగు పొరుగు వారితో సోదర భావంతో మెలగాలన్నారు. అందరికీ శోభకృత నామ తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తెలుగు సంవత్సరానికి ఆంగ్ల సంవత్సరానికి తారతమ్యం గురించి వివరిస్తూ.. మన తెలుగు సంవత్సరం సూర్యోదయంతో, కొత్త వెలుగులతో, విచ్చుకున్న పుష్పాల అందంతో, కోయిల కూతల సుప్రభాతంతో ఆరంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్, ప్రిన్సిపల్ బి.రవీంద్ర, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ విశిష్టతను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి విద్యార్థులకు వివరించారు. తెలుగు వారికి ఉగాది పండుగ అతి ముఖ్యమైందన్నారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించార. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్లు లేకపోతే మనుగడే లేదు : పిసిసి

వేంపల్లె : అడవులు, చెట్లు లేకపోతే మానవజాతి మనుగడే లేదని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆశోకుడు చెట్లు నాటేతే సిఎం జగన్ వాటిని నరికి వేసేలా పాలన సాగిస్తున్నారన్నారు. మానవునికి అవసరమైన ప్రాణవాయువు చెట్లు ఇవ్వడమే కాకుండా మానవుడు వదిలిన కార్బన్‌డైయాక్సైడ్ వాయువును చెట్లు గ్రహిస్తాయన్నారు. భారత నాగరికత అంతా అడవుల్లోనే పుట్టిందన్నారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మున్సిపల్ కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని మునిసిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ వి వరప్రసాద్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. మంగళవారం వారు మునిసిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డితో కలిసి మునిసిపల్ ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని పరిశీలించారు. భవనాన్ని నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. మునిసిపల్ కార్యాలయ పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. మునిసిపల్ డిఇ సుభాష్ చంద్రబోస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యాదవకాలనీలో చోరీ

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల కేంద్రంలోని యాదవ కాలనీలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన ప్రకారం.. యాదవ కాలనీలో నివాసం ఉంటున్న సురేష్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం తన భార్యతో కలిసి ఊరికి వెళ్ళాడు. మంగళవారం ఉదయం సురేష్ వాళ్ల అమ్మ వెళ్ళి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. చోరీ జరిగిందని తెలుసుకుని తన కొడుకు సురేష్‌కు ఫోన్ ద్వారా విషయం తెలిపింది. ఇంట్లోకి వెళ్ళి చూడగా బీరువాలో ఉన్న రూ.60వేలు దోచుకెళ్లినట్లు బాధితులు చెప్పారు. కడప నుండి క్లూస్ టీమ్ అధికారులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రమోహన్

యథేచ్ఛగా కర్ర బొగ్గు తయారీ, రవాణా

- పట్టని అధికారులు.. వ్యాపారంలో బ్రోకర్లదే హవా

ప్రజాశక్తి - కొండాపురం

నిబంధనలకు విరుద్ధంగా మండలంలో కర్ర బొగ్గు తయారీ, రవాణా సాగుతున్నా అటవీశాఖ అధికారులకు పట్టడంలేదు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బొగ్గు తయారీకి సంబంధిత భూమి యజమాని తమ భూమి సర్వే నెంబరుతో సహా తెలియజేస్తూ అధికారులకు దరఖాస్తు సమర్పించాలి. ఆ మేరకు అటవీశాఖాధికారులు అక్కడ బొగ్గు తయారీకి కావలసిన కర్రలు ఉన్నాయోలేదో పరిశీలించాల్సి ఉంది. అనువుగా ఉన్నచో ఎంత మోతాదులో ఉందో తెలుపుతూ అనుమతులివ్వాల్సి ఉంది. బొగ్గు తయారు చేసిన తర్వాత విక్రయించేందుకు అటవీశాఖ వారి ద్వారా పర్మిట్(అనుమతి) పొందాలి. సదరు బొగ్గును లారీలో లోడు చేసే సమయంలో రేంజర్‌స్థాయి అధికారి దగ్గరుండాలి. ఒక బస్తాలోఎన్ని కిలోలు ఉన్నాయి, రవాణా చేయు వాహనంలో ఎన్ని బస్తాలు లోడు చేశారు, వాహన నెంబరు, ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతోంది, విక్రయించే ప్రదేశం, సదరు వాహనం ఎప్పటిలోగా చేరుకుంటుందనే వివరాలు లోడు చేసే ప్రదేశంలో రేంజర్‌స్థాయి అటవీశాఖ అధికారి దగ్గరుండి చూడాలి. అనంతరం అనుమతి పొందుపరచాల్సి ఉంది. ముద్దనూరు పారెస్టు పరిధిలోని అటవీశాఖ అధికారులు ఆ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు బ్రోకర్లను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా వ్యవహారాలు నడిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముద్దనూరు అటవీశాఖ పరిధిలోని కొండాపురం, ముద్దనూరు, తొండూరు మండలాల నుండి కోట్ల రూపాయల బొగ్గు పక్క రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రకు విరివిగా తరలిస్తున్నారు. కొండాపురం మండలంలోని ఓ బొగ్గు వ్యాపారి తన బొగ్గు సరఫరా కోసం బొగ్గు తయారీ ప్రదేశంలో ఒక లారీ కాటాను ఏర్పటు చేసుకొన్నాడంటే ఈ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతోందో అర్థమవుతోంది. కొండాపురం మండలంలోని కొండాపురం, చౌటిపల్లె, ఏటూరు, టి.కోడూరు, కె.సుగుమంచిపల్లె, తాళ్ళప్రొద్దుటూరు, వెంకయ్య కాలువ, బెడుదూరు, కొత్తపల్లె, గ్రామాల్లో బొగ్గు విరివిగా తయారు చేస్తున్నారు. కొండాపురం మండలంలోని కొందరు బొగ్గు వ్యాపారులు గండికోట ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో జెసిబిలు తెప్పించి కట్టెలు, మొద్దులు పెకలించి అక్రమ వ్యాపారం చేస్తున్నారనే సమాచారం ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.


జాతీయ రహదారి పక్కన కాలుతున్న బొగ్గు బట్టీలు

అధికారులు స్పందించాలి

అటవీశాఖలో చెట్ల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికైనా అక్రమ బొగ్గు తయారీపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందని పలువురు కోరుతున్నారు.

నీటి పొదుపు అత్యంత ఆవశ్యకం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు, సభ్యులు, యాజమాన్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతి ఒక్కరూ నీటి పొదుపు అత్యంత ఆవశ్యకమని గుర్తించాలని డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వేద వ్యాస డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవం, క్యాచ్ ది రైన్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ విక్రాంత్ తేజ మాట్లాడుతూ భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో అడుగంటకుండా ఉండేందుకు మానవుడు ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు భవిష్యత్ తరాల కోసం నీటిని బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. నీటిని పొదుపు ద్వారా మానవ మనుగడ కొనసాగుతుందని తెలిపారు. వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నీటి సమస్య తీర్చుటకు ముందస్తు ప్రణాళికను ప్రతి ఒక్కరూ రూపొందించుకోవాలని అన్నారు. అనంతరం నీటి పొదుపు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ సిబ్బంది రామలక్ష్మణరెడ్డి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గోరుముద్ద'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నుంచి అమలుచేస్తున్న రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి టి.లక్షుమయ్య కోరారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో పండుగ వాతావరణంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎంపిపి చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహార మెనూను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టారన్నారు. వారంలో 3రోజులు ఉదయం విరామ సమయంలో ఈ రాగి జావ అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రవిశంకర్, ప్రధానోపాధ్యాయులు గౌస్‌మొహిద్దీన్, సర్పంచు మహబూబ్ బీ, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు. అన్నవరంలో ప్రధానోపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, మండల గృహసారథుల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, ఎంపిటిసి సీమోన్, సర్పంచు పీరయ్య, లక్ష్మీపేటలో ప్రధానోపాధ్యాయులు నరహరిశర్మ, జిల్లా రైతు సలహా మండలి సభ్యులు కర్నాటి నారాయణరెడ్డి, మొర్రాయపల్లెలో సర్పంచు శ్రీనువాసుల రెడ్డి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


చాపాడులో మాట్లాడుతున్న ఎంపిపి టి.లక్షుమయ్య

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు, నల్లబల్లె ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఎంపిపి-1 రేణుక ఆధ్వర్యంలో రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం నేటి నుండి వారానికి 3 రోజుల పాటు ఉదయం పూట రాగిజావ అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణారెడ్డి, ఎంఇఒ విజయ భాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకులు వీరప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ శాసన వ్యవస్థలో మచ్చ : టిడిపి


విలేకరులతో మాట్లాడుతూన్న లింగారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన ఘటన దేశ శాసన వ్యవస్థలో మచ్చగా మిగిలిపోతుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా, పలు శాఖల మంత్రిగా పనిచేసిన టిడిపి సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరిని తోసేయడం, ఎమ్మెల్యే డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిపై అధికారపార్టీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు దాడి చేయడం అమానుషమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి తుడిచిపెట్టుకుపోయిందన్న ఆక్రోషాన్ని టిడిపి సభ్యులపై ప్రదర్శించడాన్ని ఖండిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి డిపాజిట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. దాడి విషయంలో స్పీకర్ మౌనం దాల్చడం విచారకరమన్నారు. ఎమ్మెల్యేపై దాడికి దిగిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అధికారం స్పీకర్ ఉందన్నారు. శాసనసభ, న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, హైకోర్టు, సుప్రీం కోర్టు జడ్జిలను దూషించడం వైసిపి నాయకులకు అలవాటే అన్నారు. ఇప్పటికైనా పరిపాలన సక్రమంగా నిర్వహించే పద్ధతి నేర్చుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని లింగారెడ్డి డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు లాయర్ గుర్రప్ప, సిద్దయ్య, తెలుగు యువత నాయకులు రామ్మోహన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మినీ బస్టాండ్ కోసం కలెక్టర్ స్థల పరిశీలన

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో మినీ బస్టాండ్ ఏర్పాటుకు కలెక్టర్ విజయ్ రామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ స్థలాన్ని పరిశీలించారు. ఆ మేరకు మంగళవారం సాయంత్రం వారు వేంపల్లెకు విచ్చేశారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆయా పట్టణాలకు వెళ్లే బస్సులు వేంపల్లెలోని నాలుగు రోడ్లకూడలిలోని జడ్పీ వాణిజ్య గదుల వెనుక వైపు నుండి బస్సులు వెళ్ళేందుకు మినీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో జడ్పీ వాణిజ్య గదుల వెనుక ఉన్న పంచాయతీ స్థలాన్ని, బిఎస్ఎన్ఎల్ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. నివేదిక పంపాలని కోరారు. కలెక్టర్ వేంపల్లెకు వచ్చిన విషయం తెలుసుకున్న తమలపాకు తోటల రైతులు ఆయనను కలిసి పరిహారంపై ఇ క్రాప్ ఉండాలని వ్యవసాయ అధికారులు చెప్పుతున్నారని తెలిపారు. తప్పకుండా ఇ క్రాప్ చేసుకోవాలని కలెక్టర్ చెప్పడంతో తమలపాకు రైతులు అందరూ కౌలు రైతులు చేసుకోలేదని వివరించారు. ఇ క్రాప్ ఉంటేనే పరిహారం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, జడ్పీ సిఇఒ సుధాకర్ రెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, ఎంపిటిసిలు భారతి, కటిక చంద్రశేఖర్, కమతం రాజా, అయ్యవారిపల్లె సర్పంచు రామగంగిరెడ్డి, పిఆర్పీ డిఇ శరత్‌చంద్రరెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రఘురాం, అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

24న పంచాయతీ స్థలాలకు వేలం

ముద్దనూరు : 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ బస్టాండు, జంతు వధశాల, సులభ్ కాంప్లెక్స్‌కు సంబంధించి ఈనెల 24న పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించన్నట్లు కార్యదర్శి లక్ష్మీ నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్టాండుకు రూ.2 లక్షలు, జంతు వధశాలకు రూ.20వేలు, సులభ్ కాంప్లెక్స్‌కు రూ.5వేలు డిపాజిట్ చెల్లించవలసి ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని కార్యదర్శి కోరారు.

నేడు కొండపల్లి చిదంబర నటరాజుకు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

16 తబలాలపై శాస్త్రీయ సంగీతాన్ని పలికించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును సృష్టించిన పార్వతీనగర్‌కు చెందిన కొండపల్లి చిదంబర నటరాజుకు ఉగాది సందర్భంగా బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పౌర సన్మానం నిర్వహిస్తున్నట్లు హెడ్స్ సంస్థ నిర్వహకులు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, హంస అవార్డు గ్రహీత కొండపల్లి వీరభద్రయ్య పాల్గొంటారన్నారు.

విద్యాభివృద్ధికి జగనన్న పెద్దపీట

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని పురపాలక చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ కొండలరావు, పార్నపల్లి కిషోర్ అన్నారు. మంగళవారం పాత్రసత్రం పాఠశాలలో, అహోబిలపురం మెయిన్ పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలు రాగిజావ తాగేందుకు కౌన్సిలర్ కొండలరావు సొంత నిధులతో 200 గ్లాసులను తెప్పించారు. ఇవ్వడం జరిగింది. వీటిని చైర్మన్ చేతుల మీదుగా పిల్లలకు రాగిజావా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజ్, మూలి మహేశ్వర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీభార్గవి, రంగనాయకులు, కో-ఆప్షన్ నెంబర్ చంద్రమౌళి, వైసిపి నాయకులు సోపాల వీర, దశరథరామిరెడ్డి, రవి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.


విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న చైర్మన్ వరప్రసాద్

రేపు సీజ్ చేసిన వాహనాలకు వేలం పాట

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 23న వేలం పాట నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కెఎస్ లత ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో వేలం పాట నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. ఆసక్తిగల వారు తమ ఆధార్ కార్డు లేదా ఏదైనా గుర్తింపుకార్డుతో వేలంలో పాల్గొనాలని కోరారు.

పునరావాసం కల్పించండి

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన రేగడపల్లి గ్రామస్తులు తమకు పునరావాసం కల్పించాలంటూ అధికారులను మొరపెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రేగడిపల్లి గ్రామంలో మంగళవారం ఆర్‌డిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ శోభన్‌బాబు ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు వారితో మాట్లాడుతూ ముంపువాసుల పునరావాసానికి సంబంధించి రావలసిన రూ.10లక్షలు ప్యాకేజీకి సంబంధించి ఇప్పటికే రూ.6లక్షల 75వేలు చెల్లించామని తెలిపారు. మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో చెల్లిస్తామన్నారు. అందరూ సహకరించి గ్రామాన్ని ఖాళీ చేయాలని అధికారులు కోరారు. ఇందుకు గ్రామస్తులు అంగీకరించలేదు. తమకు నగదు అవసరం లేదని, పునరావాస కాలనీ ఏర్పాటు చేసి, అర్హులైన వారందరికీ ఆవాసం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా తెలియజేసినట్లు ఎంపిటిసి సభ్యులు కెవై చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు శృతి, వైసిపి నాయకులు నాగేశ్వరరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేంపల్లెలో విద్యార్థుల ర్యాలీ

వేంపల్లె : నీరు అనేది ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ నీటి విలువలపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు అన్నారు. మంగళవారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బాలుర పాఠశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, నీటీ విలువలపై నినాదాలు చేశారు. నీటిని సంరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీ నిరహిస్తున్న విద్యార్థులు

మట్టి మిద్దె కూలి మహిళలకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని బి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ కుమ్మరి కొట్టాలు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున మట్టిమిద్దె కూలింది. అందులో జంపన శివమ్మ కుటుంబసభ్యులు ఉంటున్నారు. ఈ ప్రమాదంలో చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చౌడు మిద్దె తడిసి ఈ ప్రమాదం జరిగినట్లు బాధితురాలు శివమ్మ తెలిపారు. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు పూర్తిగా దెబ్బ తిన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు పక్కా గహాన్ని మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. గతంలో పక్కాగృహం కోసం అధికారుల చుట్టూ తిరిగినా మంజూరు చేయలేదని తెలిపారు.


కూలిన మట్టిమిద్దె

ఎస్‌బిఐ సేవలపై కళాజాతా

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడు ఎస్‌సి కాలనీలో మంగళవారం ఎస్‌బిఐ సేవలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎస్‌బిఐ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ సేవలపై ప్రజలకు వివరించారు. రాయలసీమ జానపద కళాకారులు వై.జయకష్ణ, శ్రీనివాసులు, బి.సుబ్రహ్మణ్యం పాటలు, మ్యాజిక్ ద్వారా ప్రధానమంత్రి సురక్ష యోజన, బాలిక సంరక్షణ, వ్యక్తిగత బీమా, వడ్డీ రేట్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిసి గురుమహేశ్వర్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.